క్లుప్తంగా

రథయాత్రను విజయవంతం చేయండి

తాండూరు టౌన్: పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర నేడు జిల్లాలోకి ప్రవేశించనుందని, ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర సాహిత్య కమిటీ సభ్యుడు మురహరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మధ్యాహ్నం 1 గంటలకు వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నడకర్యాలీ, సమావేశం ఉంటుందని, అనంతరం రథ యాత్ర తాండూరులోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. కావున 2.30 గంటలకు తాండూరు శివారులోని ఖాంజాపూర్ గేట్ నుంచి ఇందిరా చౌక్ వరకు బైకు ర్యాలీ ఉంటుందని, తర్వాత అక్కడే సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

సంపూర్ణ మద్దతు

యాలాల: పాత పెన్షన్ సాధన కోసం చేపట్టిన సంకల్ప రథయాత్రలో భాగంగా శనివారం తాండూరు పట్టణంలో చేపట్టనున్న బైక్ ర్యాలీ, సమావేశానికి పీఆర్‌టీయూ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్ తెలిపారు. తాండూరు మండలం ఖాంజాపూర్ గేటు నుంచి చౌరస్తా వరకు చేపట్టనున్న బైక్ ర్యాలీలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. 'అభి నహితో.. కబీ నహీ' అనే నినాదంతో పాత పెన్షన్ సాధనకు గట్టిగా పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

హైమాస్ట్ దీపాలు ప్రారంభం



స్విచ్ఆన్ చేస్తున్న సర్పంచ్

కొడంగల్: నందిగామలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాలను సర్పంచ్ సావిత్రమ్మ శుక్రవారం ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయడం వలన రాత్రి వేళల్లో వెలుతురు బాగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సహకారంతో గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని బీఆర్ఎస్ యువ నాయకుడు సాయిలు, పీఏసీఎస్ డైరెక్టర్ వినోద్, ఉప సర్పంచ్ అంజి అన్నారు. మక్బూల్, మల్కమ్మ, నర్సమ్మ, సాయమ్మ, అబ్దులప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై.. యమపాశాలు!



ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుత్ లైన్

కొడంగల్ రూరల్: తండాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. కొడంగల్ మండలం బీంలీతండా, భవనమ్మతండా, పల్లుగ్రాళ్లతండాల్లో తరచూ కరంట్ సమస్యలు తలెత్తున్నాయని వాపోతున్నారు. భవనమ్మతండాలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేసిన కొద్ది రోజులకే మరలా సమస్య తలెత్తుందని చెబుతున్నారు. బీంలీ తండాలో ఇళ్లపై నుంచే విద్యుత్ లైన్లు తీశారని, ప్రమాదకరంగా వేలాడుతున్న ఆ తీగలతో భయంగా ఉందని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు.

కరిగెటలో రైతులు బిజీ

కొడంగల్ రూరల్: పొలం పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. వర్షం కొడుతున్నా.. బీంలీతండా, భవనమ్మతండాల్లో వరి సాగులో భాగంగా కరిగెట కొడుతున్నారు. పై నుంచి పాటు కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో కరిగెటకు అనుకూలంగా ఉందని రైతులు పేర్కొన్నారు. వర్షాలతో వరి పంటకు మేలు జరుగుతున్నా.. కంది, పత్తి, మినుము, పెసర దెబ్బతిని నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

చెరువులకు జలకళ

ఎడతెరిపి లేని వర్షాలతో చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. పట్టణశివారులోని పెద్ద చెరువులోకి నీరు వచ్చి చేరుతుండడంతో నిండుకుండలా తలపిస్తోంది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చేపల వేటలో..

వరుస వర్షాలతో వాగులు, వంకలు ప్రవహిస్తుండడంతో యువకులు చేపల వేటలో బిజీగా ఉన్నారు. కొడంగల్ పెద్ద చెరువుకు పాటు కాలువ పారుతుండడంతో పట్టణశివారులోని నాజ్‌ఖాన్‌పల్లి గ్రామ రహదారిలో కాలువ పొడవునా చేపలు పడుతూ కనిపించారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

తాండూరు టౌన్: పట్టణంలోని తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్, నిర్వాహకురాలు నీరజాబాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ శివానంద ఆచార్య ఆధ్వర్యంలో పది రోజుల పాటు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శిక్షణ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. సోమవారం నుంచి ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు తరగతులు ఉంటాయని, ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పశువులు పైలం

- పొంచిఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- నివారణ చర్యలు, చికిత్స తప్పనిసరి
- మూగజీవాలకు సోకే వైరస్‌లపై రైతులు అప్రమత్తం



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న వైద్యులు (ఫైల్)

నవాబుపేట: వర్షాకాలంలో మనుషులకే కాదు.. మూగజీవాలకు వ్యాధుల ముప్పు తప్పదు. పశువులు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సూక్ష్మజీవుల కారణంగా గొంతువాపు, జబ్బవాపు లాంటి వ్యాధులు ముసరడంతో పాటు, ఈగలు, దోమల దాడి పెరుగుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులు సకాలంలో తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని, పశువులకు వైద్య చికిత్స చేయించాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి

గాలికుంటు వ్యాధి సోకిన పశువలు చాలా బలహీనంగా ఉంటాయి. పాడి పశువులు నీరసంగా ఉంటాయి. పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. వ్యవసాయ పనులు చేయడానికి ఎడ్లు సహకరించవు. సంకరజాతితో పాటు షెడ్లలో పెంచుకునే పశువులకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఎక్కువగా మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ఈ రోగం చుట్టుముట్టే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పశువులకు నోటి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3,4 వారాల్లో అవి పగిలి పుండ్లుగా మారుతాయి. చర్మం గరుకుగా మారుతుంది. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడటం, తద్వారా మేత, తీసుకోక నీరసించిపోతాయి. సొంగ కూడా కారుతుంది.

జబ్బవాపు వ్యాధి

ఆరోగ్యవంతం, తెల్లజాతి పశువుల్లో జబ్బవాపు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధి సోకిన పశువు అధిక జ్వరంతో బాధపడుతుంటుంది. మేత మేయకుండా పడుకొనే ఉంటుంది. జబ్బభాగం వాచి, నల్లగా కములుతుంది. అక్కడ కండరాలు ఉబ్బుతాయి. వాటిలో గాలి బుడగలు, నీరు చేరి పశువు తీవ్రమైన నొప్పితో బాధపడుతుంటుంది. వాచిన చోట చేతితో తాకితే గరగరమని శబ్దం వస్తుంది. సకాంలో వైద్యం అందకపోతే చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధిని గమనించి సకాలంలో ఇంజెక్షన్, గ్లూకోజ్ ద్రావణాన్ని అందించాలి. ఈ వ్యాధి సోకకుండా ముందుగా టీకాలు వేసుకుంటే మేలు.

గొర్రెల్లో కాలిపుండ్లు

వానాకాలంలో గొర్రెలు బురదలో తిరగడం వలన కాలిపుండ్లు వ్యాధి వ్యాపిస్తుంది. గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి చిట్లుతుంది. చీముపట్టి నొప్పితో ముందుకాళ్లపై గెంటుతుంటాయి. వ్యాధి ముదిరితే గిట్టలు ఊడిపోతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలకు 10 శాతం మైలతుత్తం, పదిశాతం జింక్‌సల్ఫేట్, లేదంటే ఐదుశాతం ఫార్మలిన్‌లో ఏదైనా ఒక ఆయిట్‌మెంట్ పూయాలి. యాంటిబయాటిక్ ఇంజెక్షన్లు వరుసగా 3–5 రోజులు వేయించాలి. అంతే కాకుండా గొర్రెలను బురద నేలల్లో ఎక్కువగా తిరగనీయొద్దు.

గొంతువాపు సోకితే..

వర్షాకాలంలో పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు(గురక) ఒకటి. ముఖ్యంగా వయసులో ఉన్న గేదెజాతి పశువుల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వ్యాధి సోకిన వాటికి జ్వరం వస్తుంది. మేత మేయవు. గొంతుపైన, మెడ కింద వాపు కన్పిస్తుంది. పశువు ఆయాసపడుతూ శ్వాస పీల్చుకుంటుంది. ఆ సమయంలో గురక శబ్దం వస్తుంది. నోరు, ముక్కు నుంచి ద్రవం కారుతుంది. పశువు వణుకుతూ ఉంటుంది. కంట వెంట నీరు కారుతుంది. పాడి పశువుల్లో పాలదిగుబడి తగ్గుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువగా అయితే పశువు ఎడతెరిపి లేకుండా దగ్గుతూ, చివరకు అపస్మారక స్థితిలోకి వెళ్లి చనిపోతుంది.

లేత గడ్డి ప్రమాదమే

తొలకరి వర్షాలకు మొలిచే లేత గడ్డి మొక్కలను పశువులు అతిగా తింటుంటాయి. అయితే ఎదిగీ ఎదగని లేత గడ్డిలో హైడ్రో సైనైడ్ విష పదార్థం ఉంటుంది. ఇలాంటి గ్రాసాన్ని మేసిన 15 నిమిషాలకే పశువుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. వెంటనే తగిన చికిత్స చేయించకపోతే పశువు ముత్యువాత పడే ప్రమాదం ఉంది. కాబట్టి రైతులు పశువులకు లేత గడ్డిని తిననివ్వవద్దు.

ఈగలు, దోమలు దాడి చేస్తే

అపరిశుభ్రంగా నీరు నిల్వ ఉన్న గుంతలు, మురుగునీటి కాలువల్లో ఈగలు, దోమలు వృద్ధి చెందుతాయి. ఇవి ఆహారం కోసం పశువులపై వాలుతుంటాయి. వర్షాకాలంలో వీటి తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈగలు, దోమలు పశువుల శరీరంపై వాలి రక్తాన్ని పీలుస్తాయి. తద్వారా పశువులు మేత సరిగ్గా మేయవు. నిద్ర పోవు. ఫలితంగా అవి రక్తహీనతకు గురవుతాయి. ఈగలు, దోమ కాటు వలన పశువు శరీరంపై పుండ్లు ఏర్పడతాయి. అందుకు పశువుల పాకల సమీపాన నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్‌ను పిచికారి చేయాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండుపిడకలు, వేపాకుతో పొగపెడితే ఈగలు, దోమల బెడద తగుతుంది.

విద్యారంగ సమస్యలు పట్టని ప్రభుత్వం



తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ సంఘ నాయకులు

- మధ్యంతర భృతిని ప్రకటించి, పదోన్నతులు చేపట్టాలి
- తహసీల్దార్‌కు ఉపాధ్యాయ సంఘం నేతల వినతి

కుల్కచర్ల: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బహదూర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పీఆర్‌సీ కమిషన్ వేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని, తక్షణమే పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించి బదిలీలు చేపట్టాలని కోరారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల సాధనలో భాగంగా ఆగస్టు 5వ తేదీన కలెక్టరేట్ వద్ద, 19న ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారంలో తపస్ ఉపాధ్యాయ సంఘం నిర్విరామంగా పోరాటం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, నాయకులు బుచ్చిలింగం, మధుసూదన్, రవి, సంతోష్, కృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సరైన సమయం



ఎన్కేపల్లిలో మొక్కలు నాటుతున్న కూలీలు

ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఇదే సరైన సమయని ఎంపీడీఓ శైలజారెడ్డి అన్నారు. శుక్రవారం మోమిన్‌పేట మండలం ఏన్కతల, ఎన్కేపల్లిలో ఆమె పర్యటించి మాట్లాడారు. వర్షాలు అధికంగా కురుస్తుండటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. అదే సమయంలో మొక్కలు నాటేందుకు సరైన సమయం కనుక, మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని, నాటిన ప్రతి మొక్క బతుకుతుందని చెప్పారు. అంతే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ సూచించారు. ఆమె వెంట సర్పంచ్ అంతమ్మ, కార్యదర్శి తిరుపతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ అడివిరెడ్డి తదితరులు ఉన్నారు.

భారీ వర్షాలతో భద్రం

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ప్రవహిస్తున్న వాగుల వద్దకు వెళ్లొద్దు
- అధికారుల సూచన



కొడంగల్ రూరల్: అలుగు పారుతున్న కొడంగల్ పెద్ద చెరువు

పెద్దేముల్: భారీ వర్షాలతో ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారం చైతన్యనగర్, మంబాపూర్, పెద్దేముల్‌తో పాటు పలు గ్రామాల్లో ఆర్ఐ రాజిరెడ్డి పర్యటించి, కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. వర్షాలతో ఇళ్లు కూలిపోతే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ముఖ్యంగా చెరువులు, వాగుల వద్దకు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరించారు.

అంటువ్యాధుల పట్ల అప్రమత్తం

అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు అన్నారు. మండల కేంద్రంలో పలు వార్డుల్లో ఆయన పర్యటించి సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వానాకాలంలో ప్రతి ఒక్కరూ జాగ్రతలు పాటించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ హరిశంకర్, ఏఎన్ఎం కవిత, ఆశ వర్కర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న పెద్ద చెరువు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని పెద్ద చెరువు అలుగు పారుతోంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి మత్తడి పోస్తుండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 550ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువు కింద, రెండేళ్లుగా ఒకే కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో 165ఎకరాల మాత్రమే సాగవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వర్షాలు వరి సాగుకు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు.

దున్నపోతుకు వినతిపత్రం



దున్నపోతుకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

తాండూరు రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు వినూత్న నిరసన తెలిపారు. శుక్రవారం నాటికి సమ్మె చేపట్టి 23 రోజులు అయిన సందర్భంగా వారు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దున్నపోతుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. మూడు వారాలుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే వారి న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు శాంతమ్మ, వెంకటమ్మ, జిలానీ, భీమయ్య, రవి, నర్సింహులు, జగన్, కిష్టప్ప, శ్యామప్ప, నరేష్, లక్ష్మీ, చందు, బాలమణి పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా?

- అధ్వానంగా కరన్‌కోట్ రహదారి
- గోతుల రోడ్లలో దిగబడుతున్న వాహనాలు
- నిత్యం ట్రాఫిక్ కష్టాలు





ధ్వంసమైన కరన్‌కోట్ రోడ్డు (ఇన్‌సెట్లో) వాహనదారుల ఇబ్బంది

తాండూరు రూరల్: పేరు గొప్ప.. ఊరు దిబ్బలా మారింది తాండూరు నియోజకవర్గ పరిస్థితి. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నామని పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అసలు దుస్థితి బయట పడుతోంది. ప్రధానంగా రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ధ్వంసమైన రోడ్లుతో వాహనదారులు అవస్థ పడుతున్నారు. ఎడతెరిపి లేని వర్షాలకు తాండూరు మండలం కరన్ కోట్ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి కరన్‌కోట్ వరకు రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ బెల్కటూర్ నుంచి కరన్‌కోట్ వరకు రోడ్డు మరమ్మతు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. గోపన్‌పల్లి నుంచి గౌతపూర్ చెక్‌పోస్ట్ వరకు మట్టి, కంకరవేసి చేతులు దులుపుకొన్నారు. ఈ మట్టి రోడ్డు వర్షాలకు బురదమయమై.. పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి.

మరమ్మతు పనులు చేపట్టండి

తాండూరు టౌన్: కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలో పాడైపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని బీజేపీ తాండూరు పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముంపు కాలనీలకు వరద చేరడంతో అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సంబంధిత అధికారులు పర్యటించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంతే కాకుండా పలు కాలనీల్లో సీసీరోడ్లు, మురుగుకాలువల నిర్మాణం చేపట్టాలని, ధ్వంసమైన రహదారులకు మరమ్మతు చేయించాలని పేర్కొన్నారు.

రద్దీరోడ్ల దుస్థితి పట్టని అధికారులు

కరన్‌కోట్‌లో సీసీఐ, బెల్కటూర్‌లో పెన్నాతో పాటు సరిహద్దులో సాగర్ సిమెంట్ కర్మాగారాలు, ఓగిపూర్‌లో నాపరాతి గనులు ఉన్నాయి. దీంతో నిత్యం కరన్‌కోట్ రోడ్డు రద్దీగానే ఉంటుంది. వందల సంఖ్యలో భారీ వాహనాలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుండగా.. అంతంత మాత్రంగానే ఉన్న రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. సాధారణ వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

శిథిలమైన ఇళ్లలో ఉండొద్దు

పరిగి: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం వార్డుల్లో పర్యటించి శిథిలావస్థ ఇళ్లల్లో ఉండొద్దని చెప్పారు.

పంటలు వర్షార్పణం

మొన్నటి వరకు వానల కోసం ఆకాశం వైపు చూసిన అన్నదాతలు.. ప్రస్తుత విస్తృత వర్షాలకు విలపిస్తున్నారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో జలకళ సంతరించుకొని, భూగర్భ జలాలు పెరిగాయని సంబుర పడినా.. నీట మునిగిన పంటలతో మూగగా రోధిస్తున్నారు.

- దిక్కుతోచని అన్నదాతలు
- పరవళ్లు తొక్కుతున్న వాగులు, వంకలు
- చెరువులకు జలకళ



దాదాపూర్ నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ

దోమ: వర్షం బీభత్సం సృష్టించింది. వారం పదిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చెరువులు అలుగు పోయగా.. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఫలితంగా పలు ప్రాంతాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. పంట పొలాలు నీట మునిగి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది.

నీటిపాలు..

పంటచేలు నీట మునిగి రైతులు వెలవెల బోతున్నారు. మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో 14,530 మంది రైతులు ఉన్నారు. వీరికి 28,370 ఎకరాల్లో సాగు భూమి ఉంది. అయితే ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు ఆయా గ్రామాల రైతులు 10,405 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేయగా.. ప్రస్తుత వర్షాలకు 12 వందల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటలు నీట మునిగినట్లు స్థానిక వ్యవసాయ అధికారులు చెప్పారు. గ్రామాల్లో పర్యటించిన అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

జాగ్రత్తలు

పంటలు నీట మునిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు సూచనలు చేస్తున్నారు. మొక్కజొన్న, పత్తి మొక్కల సాళ్ల మధ్యలో వాననీరు నిల్వ లేకుండా చేయాలి. పత్తి మొక్క పసుపు రంగులోకి మారితే అధిగమించేందుకు 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గితే మొక్క ఎదగడానికి 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేయాలి. అధిక తేమతో పత్తి మొక్క వేరుకు కుళ్లు సోకే అవకాశం ఉంటుంది. కాబట్టి నివారణకు 3 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రామ్ కార్బొండజిమ్ తీసుకొని లీటరు నీటిలో మొక్కల పాదులపై వారం వ్యవధిలో రెండు సార్లు వేసుకోవాలి. మొక్కజొన్న సాగు అధిక తేమ శాతం వలన భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారుతాయి. వర్షాలు తగ్గుముఖం పడితే పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. ఎకరానికి 20–25 కిలోల యూరియా, 15–20 కిలోల మూరేట ఆప్ పొటాష్‌ను వేసుకోవాలి. కత్తెర పురుగు తగిలితే క్లోరంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. నీటికి కలిపి ఆకుల సుడులు తడిచేలా పిచికారీ చేసుకోవాలి.

సూచనలు ఇస్తున్నాం



పంటలు నీట మునగడంతో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం. నీట మునిగిన పంటలకు నష్టం జరగకుండా అవసరమైన మందులను పిచికారీ చేసుకోవాలని సూచిస్తున్నాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– చెన్నయ్య, ఏఈఓ, దాదాపూర్ క్లస్టర్

అందరూ పాటించాలి



పంటలు నీటి పాలయ్యాయి. ఆ పొలాలను పరిశీలిస్తున్నాం. పలు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. అవసరమైన మందులను పిచికారీ చేసి, పంట నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నాం. ఏఈఓలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

– ప్రభాకర్ రావు, ఏఓ, దోమ

బాధితులను ఆదుకోండి సారూ



పరిగి: ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పరశురాంరెడ్డి



కొడంగల్: కూలిన ఇంటి వద్ద బాధితుడు

- ఇళ్లు కూలి పాఠశాలలో తలదాచుకుంటున్న ప్రజలు
- ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన నేతలు

పరిగి: వర్షాలకు ఇల్లు కూలిపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. వరుస వర్షాలకు మండలంలో చాలా గ్రామాల్లో ఇళ్లు కూలాయని, బాధితులు పాఠశాలల్లో తలదాచుకుంటున్నారని పేర్కొన్నారు. ఇల్లు కట్టుకునే స్థోమత లేని వారు ఎంతో మంది ఉన్నారని, బాధితులను గుర్తించి, వారికి పరిహారం అందేలా చూడాలని కోరారు. తహసీల్దార్ రాంబాబు ఉన్నారు.

పట్టించుకోవడం లేదు..

దోమ: అధిక వర్షాలకు గ్రామాల్లో ఇళ్లు కూలిపోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని బాధుతులు ఆరోపిస్తున్నారు. కూలిన ఇళ్లను పరిశీలించాలని సంబంధిత అధికారులు మండల స్థాయి అధికారులకు చెబుతున్నా.. వారు పట్టించుకోవడం వాపోతున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి దోమ మండలం బాస్‌పల్లిలో మేకల నర్సింహులు అనే రైతు ఇళ్లు కూలిపోయింది. కూలిన ఇంటిని పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ, ఎంపీడీఓ ఎవరూ పరిశీలించలేదని బాధితుడు చెప్పారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తమ ఇళ్లను పరిశీలించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

పాత కొడంగల్‌లో..

కొడంగల్: ఎడతెరిపి లేని వర్షాలతో పాత కొడంగల్‌లో గురువారం రాత్రి మామిళ్ల మొగులయ్య అనే వ్యక్తి ఇల్లు కూలి పోయింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణహానీ లేకపోయినప్పటికీ.. ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

శ్రీవారి సేవలో..

బొంరాస్‌పేట: తిరుమల తిరుపతి దేవస్థాన సన్నిధిలో తాలూకా పరిధిలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు సేవలందిస్తున్నారు. ఈ నెల 20న స్వామివారి సేవకు బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం, దుద్యాల మండలం చిల్ముల్‌మైలారానికి చెందిన దైవసేవకులు, ఆధ్యాత్మిక భక్తులు, సేవాబృందం సభ్యులు కుమ్మరి వెంకటయ్య, మంగలి వెంకటయ్య, నెల్లి అంజిలయ్య, మంగలి రామకృష్ణ, మంగలి రవికుమార్, బంటు వెంకటయ్య, కుర్వ శ్రీనివాస్, కుమ్మరి లక్ష్మయ్య, మంగలి నగేష్, రమేశ్, చిల్ముల్‌మైలారానికి చెందిన దశరథ్, చంద్రశేఖర్, సదాశివపేట్‌కు చెందిన కుమార్‌తోపాటు 12మంది టీటీడీలో సేవలందిస్తున్నామని చెప్పారు. శ్రీవారి సన్నిధిలో రోజువారి సేవల్లో భక్తులకు అన్నదానం, వైకుంఠం–2లో ప్రసాదాల పంపిణీ, తలనీలాల సమర్పణ, ప్రాంగణం, వైద్యసేవలు, భద్రతా విభాగంలో తనిఖీ, క్యూలైన్‌లో భద్రతా సిబ్బందిగా భక్తులకు సేవ చేస్తున్నామన్నారు.